సాక్షి నల్లగొండ

మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



ధాన్యం కొనుగోలు చేయాలని..
ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో పలుచోట్ల రైతులు రోడ్డెక్కారు.

- 8లో



శోకసంద్రంలో..
ఫిలిప్పీన్స్‌లో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన మణికాంత్‌రెడ్డి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

- 8లో

గరిష్టం/కనిష్టం
36° / 26°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : పోలీస్‌స్టేషన్లలో బాధితుల ఫిర్యాదులపై సమగ్రంగా విచారించి తగు న్యాయం చేయాలని ఎస్పీ అపూర్వరావు సూచించారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఆమె మాట్లాడారు. భూ వివాదాలు, అధిక వడ్డీ వేధింపులు, కుటుంబ తగదాలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు నివేదిక ఇవ్వాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. గ్రీవెన్ డే ఫిర్యాదులపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు.

580 ఎకరాల్లో పంట నష్టం

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 580 ఎకరాలలో నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాలు వేసింది. 520 ఎకరాల్లో వరి, 60 ఎకరాల్లో పండ్ల తోటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొంది.

బీసీ సంక్షేమ అధికారి బదిలీ

నల్లగొండ : జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారిగా మైనారిటీ సంక్షేమ అధికారి బాలకృష్ణకు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బాధ్యతలను అప్పగించారు.

28న హెచ్‌సీఎల్ జాబ్ డ్రైవ్

నల్లగొండ : హిందుస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్) ఆధ్వర్యంలో టెక్‌బీ ప్రోగ్రాంలో భాగంగా ఈనెల 28న నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ జూనియర్ కళాశాలలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ దస్రూనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఎంఈసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు మ్యాథమెటిక్స్‌లో 60శాతం మార్కులు, ఓవరల్‌గా 75 శాతం మార్కులు సాధించిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సెలక్షన్స్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థికి నెలకు రూ.10 వేల చొప్పున స్టైఫండ్ చెల్లించడంతోపాటు ఉద్యోగానికి ఎంపికైతే రూ.1.70 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు చెల్లిస్తారని పేర్కొన్నారు. పూర్తిస్థాయి ఉద్యోగం చేస్తూనే బిట్స్‌పిలాని సాస్త్ర, అమిత్య, కేఎల్, ఐఐఎం నాగపూర్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య కోర్సుల్లో చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 83414 05102 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సారా నిర్మూలనకు యువత కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాణక్య

దేవరకొండ : గ్రామాల్లో సారా నిర్మూలనకు యువత కృషి చేయాలని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్) చాణక్య సూచించారు. సోమవారం దేవరకొండ మండల పరిధిలోని బండమీదితండాలో సారా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సారా వల్ల కలిగే అనర్థాలను ఆయన గ్రామస్తులకు వివరించారు. సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సూర్యప్రకాష్, సివిల్ ఎస్‌ఐ వెంకటయ్య, సర్పంచ్ సీత్యానాయక్, ఎంపీటీసీ కొర్ర గౌతమి, రాంసింగ్ పాల్గొన్నారు.

వీఓఏలను ఉద్యోగులుగా గుర్తించాలి

రామగిరి(నల్లగొండ): వీఓఏలను ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిప్పర్తి మండల కేంద్రంలో వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం ఎనిమిదో రోజు కొనసాగింది. సమ్మెకు సుధాకర్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్నెం భిక్షం, గణేష్, వెంకన్న, మంగమ్మ, కోటిరెడ్డి, వసంత, సైదులు, సువర్ణ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

గులాబీ ప్లీనరీ

అభివృద్ధి నివేదికతో ప్రజల్లోకి బీఆర్ఎస్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేడు మినీ ప్లీనరీలు
- 12 నియోజకవర్గాల్లో నిర్వహణ
- పాల్గొననున్న స్థానిక ఎమ్మెల్యేలు, రాష్ట్ర స్థాయి నాయకులు
- చేసిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై చర్చ
- పథకాలతో చేకూరిన లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ



ప్లీనరీ కోసం నకిరేకల్‌లోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన షామియానా

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి నివేదికతో బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లోకి వెళ్తోంది. నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించేలా ప్రజలను చైతన్య పరిచేందుకు పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 25వ తేదీన మినీ ప్లీనరీలు నిర్వహిస్తోంది. ఆ పార్టీ నాయకులు తొలుత గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో జెండా ఆవిష్కరణలు చేపట్టి, తరువాత ప్లీనరీలను నిర్వహించనున్నారు. ముందుగా సూర్యాపేటలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సూర్యాపేటలో ఉదయం 10 గంటలకు ప్లీనరీ ప్రారంభం కానుంది. ఆ తర్వాత మంత్రి జగదీశ్‌రెడ్డి నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్లీనరీల్లో పాల్గొంటారు. వివిధ నియోజకవర్గాల్లో ప్లీనరీలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి కడియం శ్రీహరి, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఉన్నత విద్యా మండలి సభ్యుడు నర్సింహారెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ బాలరాజుయాదవ్ తదితరులు హాజరు కానున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతుబంధు కన్వీనర్లు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, ఆయా అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచ్‌లు ఇలా ఒక్కో నియోజకవర్గం నుంచి నాలుగు వేల మంది వరకు పాల్గొననున్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చ..
బీఆర్ఎస్ పార్టీగా అవతరించిన తర్వాత మొదటిసారిగా ప్లీనరీ సమావేశాలు జరుగుతున్నాయి. వీటిని పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్లీనరీల్లో మొదట జెండా ఆవిష్కరించిన తర్వాత ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యేలు వివరిస్తారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చించనున్నారు. నియోజకవర్గానికి తెలంగాణ ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించింది. పనులు ఏ మేరకు పూర్తయ్యాయి. అవి ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో చర్చించనున్నారు. సంక్షేమ పథకాలు పేదలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయన్న దానిపై ప్లీనరీల్లో లోతుగా చర్చించనున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న అంశాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలన్న దానిపైనా చర్చిస్తారు. ప్రధానంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా ధాన్యం కొనుగోళ్లను తెలంగాణ ప్రభుత్వమే చేపట్టి రైతులను ఆదుకుంటున్న తీరును ప్రజలకు వివరించేలా, ప్రభుత్వ పథకాలతో చేకూరుతున్న లబ్ధిని ప్రజలకు తెలియజేసేలా కార్యకర్తలను సిద్ధం చేయనున్నారు. ప్రజలకు వివరించాల్సిన 50 అంశాలపై ఈ ప్లీనరీల్లో తీర్మానాలను చేయనున్నారు.

ప్రజలను చైతన్య పరుస్తాం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ మినీ ప్లీనరీ సమావేశాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ సమావేశాల్లో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను చర్చించడంతోపాటు, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కృషి చేస్తాం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో గెలిచి.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో మళ్లీ ప్రభుత్వాన్ని తీసుకువచ్చేలా ప్రజలను చైతన్య పరుస్తాం.

– మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

హాజరు కానున్న నేతలు

- నల్లగొండ నియోజకవర్గ ప్లీనరీ లక్ష్మీ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఇందులో పార్టీ ఇన్‌చార్జి కడియం శ్రీహరి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొంటారు.
- మిర్యాలగూడ ప్లీనరీలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు.
- దేవరకొండలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్, కడియం శ్రీహరితోపాటు గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొంటారు.
- నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్లీనరీలో ఎమ్మెల్యే భగత్, ఎంపీ లింగయ్యయాదవ్ పాల్గొననున్నారు.
- తుంగతుర్తిలో ఎమ్మెల్యే గాదరి కిషోర్, జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపిక యుగేందర్.
- ఆలేరులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పాల్గొనున్నారు.
- భువనగిరిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి పాల్గొననున్నారు.
- హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే సైదిరెడ్డితోపాటు తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్‌కుమార్.
- కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తోపాటు రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్.
- నకిరేకల్ ప్లీనరీలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు



కతాల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థులు

- జూన్ 12న పునః ప్రారంభం

నల్లగొండ : పాఠశాలలకు మంగళవారం నుంచి ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. జూన్ 12వ తేదీన తిరిగి పాఠశాలలు ప్రారంభమవుతాయి. అయితే ఇప్పటికే పదో తరగతి, 1 నుంచి 9వ తరగతి వరకు పరీక్షలు పూర్తయ్యాయి. దీంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతిపత్రాలు (ప్రోగ్రెస్ కార్డులు) అందజేశారు.

ఆర్టిజన్ల ముందస్తు అరెస్ట్

- తహసీల్దార్ల ఎదుట బైండోవర్
- రూ.లక్ష పూచీకత్తుపై విడుదల



గుర్రంపోడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్టిజన్లు

నల్లగొండ : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు ఈనెల 25వ తేదీనుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఇప్పటికే హెచ్82 ఆర్టిజన్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు జారీ చేశారు. అయితే ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుంది. ఇప్పటికే ఆయా గుర్తింపు పొందిన సంఘాలతో చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకుంది. గుర్తింపులేని సంఘానికి చెందిన కొందరు ఆర్టిజన్లు సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించినట్లు విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుని ఎస్మా చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టిజన్ ఉద్యోగులను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశారు. తాము సమ్మెలో పాల్గొనమని కొందరు చెప్పినప్పటికీ వారికి కూడా అరెస్టు చేసి బైండోవర్ చేశారు. వారిని రూ.లక్ష పూచీకత్తుపై విడుదల చేశారు.

ఉమ్మడి జిల్లాలో 585 మంది ఆర్టిజన్లు
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ క్యాటగిరిల్లో 585 మంది ఆర్టిజన్లు పని చేస్తున్నారు. 2017లో ప్రభుత్వం వారిని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చింది. ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. అయితే విద్యుత్ శాఖలో ఆరు నెలలపాటు ఎస్మా చట్టం అమలులో ఉన్నందున ఎవరైనా సమ్మెలోకి వెళ్తే వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని ట్రాన్స్‌కో జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు హెచ్చరించారు. అందులో భాగంగానే సమ్మెకు దిగకుండానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టిజన్ ఉద్యోగులను ముందస్తుగానే ఎక్కడికక్కడ బైండోవర్ చేశారు. తాము సమ్మెలోకి వెళ్లకముందే అక్రమ అరెస్టులు చేయడం సరైంది కాదని ఆర్టిజన్లు పేర్కొంటున్నారు.

సమ్మెకు వెళ్తే ఎస్మా చట్టం ప్రయోగిస్తాం

విద్యుత్ శాఖలో ఎస్మా చట్టం అమలులో ఉంది. ఎవరు సమ్మెలో పాల్గొన్నా ఆ చట్టం ప్రకారం వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తాం. కొందరు ఆర్టిజన్లు సమ్మెలోకి వెళ్తామని పేర్కొంటున్నందున విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయం సృష్టిస్తే.. అలాంటి వారి సమాచారాన్ని తెలియజేయాలి. నల్లగొండ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. ఏమైనా సమస్యలు ఉంటే 94408 14326 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పరిష్కరించేందుకు సిబ్బందిని నియమించాం. నల్లగొండ డివిజన్ పరిధిలో (94408 13517), మిర్యాలగూడ డివిజన్ పరిధిలో (94408 13519), దేవరకొండ డివిజన్ పరిధిలో (94910 67489) నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం.

– చంద్రమోహన్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తాం

- రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న డీలర్లు

నల్లగొండ : రేషన్ డీలర్ల సమస్యలను జూన్ 5వ తేదీలోగా పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ తెలిపారు. సోమవారం నల్లగొండలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం గ్రామీణ ప్రాంతాల్లో రూ.30 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.40 వేలు ఇవ్వాలని కోరారు. మూడు నెలల నుంచి డీలర్లకు కమిషన్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్ల వద్ద 3, 4 కిలోల బియ్యం తక్కువ ఉన్నా 6ఏ కేసులు పెడుతున్నారని, వాస్తవంగా గోదాముల నుంచే తక్కువగా వస్తున్నాయని పేర్కొన్నారు. గన్నీబ్యాగుల ధర రూ.30కి పెంచాలని, రేషన్ సరుకుల దిగుమతి హమాలీ ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం మే 1న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని డీలర్లతో నార్కట్‌పల్లిలో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కోటగిరి సూర్యనారాయణ, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, ఉపేందర్, జనార్దన్, యాదయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



కేశరాజుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ఆర్జాలబావి కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

రామగిరి(నల్లగొండ) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. నల్లగొండ మండలం కేశరాజుపల్లి, తిప్పర్తి మండలం రాయినిగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. వర్షాలు వచ్చినా ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల్లో ధాన్యం రాశులు అధికంగా ఉన్నందున ఉదయం, సాయంత్రం కాంటాలు వేయాలని, లారీలను ఏర్పాటు చేసుకొని వెంటనే మిల్లులకు చేర్చాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 1,05,463 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు. ఆయన వెంట డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు ఉన్నారు.

ధాన్యం సేకరణలో జాప్యం చేయొద్దు
నల్లగొండ రూరల్ : ధాన్యం సేకరణలో జాప్యం చేయొద్దని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. సోమవారం నల్లగొండ మండలంలోని ఆర్జాలబావిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ధాన్యం తూకం వేసిన రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని, డబ్బుల చెల్లింపునకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ముందాగానే తగిన సూచనలు చేయాలని కోరారు. రవాణా సమస్య రాకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జిల్లా నలుమూల నుంచి తరలివచ్చిన ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు బదిలీ చేసి.. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మోతీలాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఇటుక బట్టీల్లో జీవితాలు బుగ్గి

- అరకొర వేతనాలకు వలస కార్మికుల వెట్టి
- శ్రమను దోచుకుంటున్న దళారులు, వ్యాపారులు
- పని ప్రదేశంలో కనీస వసతులు, రక్షణ చర్యలు కరువు
- నిబంధనల అమలులో అధికారుల నిర్లక్ష్యం



ఇటుక బట్టీల్లో పని చేస్తున్న వలస కార్మికులు



గంద్రవానిగూడెంలోని ఇటుక బట్టీలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన గుడిసెలు

మాడుగులపల్లి : జానెడు పొట్టం కోసం వలస కార్మికులు బతుకు పోరాటం చేస్తున్నారు. ఉన్నచోట ఉపాధి లేక పొట్టకూటి కోసం వేల కిలోమీటర్లు వచ్చి కష్టాల కడలిలో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాల నుంచి సాయం అందక, కార్మిక చట్టాలు అమలుకు నోచక దుర్భరంగా బతికీడుస్తున్నారు. కార్మికుల పిల్లలూ చదువుకు దూరమై బాల్యాన్ని భారంగా గడుపుతున్నారు. జీవన పోరాటంలో కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా నమ్మిన దళారులు, కనికరం లేని వ్యాపారులు వారికి కనీస సాయం అందించకుండా కర్కషంగా వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో 80కి పైగా బట్టీలు..
నల్లగొండ జిల్లాలో 70 నుంచి 80 ఇటుక బట్టీలున్నాయి. వీటిలో ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన వలస కూలీలు పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది మధ్యవర్తుల ద్వారానే ఇక్కడి వచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కో బట్టీలో కనీసం 60 నుంచి 80 మంది కూలీలు ఉన్నారు. భార్యాభర్తలు నెల పనిచేస్తేరూ. 35 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. మధ్యవర్తులు వ్యాపారుల వద్ద ఎంత పుచ్చుకుంటున్నారో తెలియదని, వారితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇక్కడకొచ్చి పనిచేస్తున్నట్లు ఓ బట్టీలో పనిచేసే కూలీ తెలిపాడు.

అడుగడుగునా అక్రమమే..
ఇటుక బట్టీ ఏర్పాటుకు 2–5 ఎకరాల భూమి అవసరం. పంచాయతీ, రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి. కాలుష్య నియంత్రణ అధికారి నుంచి అనుమతి పత్రం పొందాలి. వ్యవసాయ భూముల్లో బట్టీ పెడితే నాలా పన్ను చెల్లించి వ్యవసాయేతర భూమిగా మార్చాలి. విద్యుత్ మోటారు, రాత్రివేళ దీపాల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ వినియోగం కోసం ముందస్తు దరఖాస్తు చేసుకొని మీటరు పెట్టుకోవాలి. కానీ కొందరు వ్యాపారులు ఇవేవీ పట్టించుకోకుండా సమీప పొలాల్లోని బోరు మోటార్లను అద్దెకు తీసుకొని నీటిని వాడుకుంటున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలున్నాయి. గ్రామానికి దాదాపు కిలోమీటరు దూరంలో బట్టీలు ఉండాలన్న నిబంధన ఉన్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు.

చదువుకు దూరంగా కూలీల పిల్లలు
వలస కూలీల పిల్లల ఆలనాపాలనా పట్టించుకునే వారు కరువవడంతో బంగారు భవిష్యత్ బుగ్గి పాలవుతోంది. ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో ఆదిలోనే చిన్నారుల ఆరోగ్యం, చదువుపై ప్రభావం పడుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం.. 6 నుంచి 14 ఏండ్ల పిల్లలకు విద్యనందించేందుకు బట్టీ యాజమాన్యమే నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రిసోర్స్ పర్సన్‌ను నియమించి విద్యనందించాల్సి ఉండగా ఎక్కడా ఆచరణ సాధ్యం కావడం లేదు. చిన్నారులను సమీప అంగన్‌వాడీల్లో చేర్చాల్సిన ఐసీడీఎస్ అధికారులు రవాణా, బాష ఇబ్బందులు తదితర సాంకేతిక కారణాలు చూపుతూ చేతులెత్తేస్తున్నారు.

పని ప్రదేశంలో వసతులు కరువు..
ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులపై వ్యాపారులు కనీస మానవతా దృక్పథం కూడా చూపడం లేదు. ఇటుకలు పేర్చి ఏర్పాటు చేసిన గదుల్లో వసతి కల్పిస్తున్నారు. తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో వారే వెళ్లి సమీపంలోని ఆర్వో ప్లాంట్ల వద్ద తెచ్చుకుంటున్నారు. మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో మహిళా కూలీలు అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్నానాల గదులు లేకపోవడంతో పురుషులు బట్టీలో ట్యాంకుల వద్ద.. మహిళలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తెరల మధ్య స్నానం చేస్తున్నారు.

కార్మికశాఖదీ అదే తీరు..
వలస కార్మికుల సంక్షేమానికి నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన కార్మికశాఖ అధికారులు మిన్నకుంటున్నారు. ఫిర్యాదులు అందగానే తూతూ.. మంత్రంగా తనిఖీలు నిర్వహించి ఆ తరువాత చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. బట్టీల్లో ఎంత మంది కూలీలు పని చేస్తున్నారు. వారికి చెల్లించే కూలి ఎంత అనే వివరాలు సమర్పించి కార్మికశాఖ నుంచి వ్యాపారులు అనుమతి తీసుకోవాలి. కార్మికులతో 8 గంటల కంటే ఎక్కువ సమయం పని చేయించొద్దు. వారు ఉండే చోట వసతులు కల్పించాలి. కొన్ని బట్టీల్లో ఇవేవి కనిపించకున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఇటుక బట్టీల్లో వలస కార్మికులతో పనిచేయించుకోవాలంటే చట్టం ప్రకారం ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలి. పని ప్రదేశంలో వారికి అన్ని వసతులు కల్పించాలి. బాలలతో పని చేయించడం నేరం. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.20 వేల జరిమానా 6 నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. వలస కార్మికుల ఇబ్బందులు మా దృష్టికి వస్తే అవసరమైతే ఆయా రాష్ట్రాల కార్మికశాఖ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తున్నాం.

– రాజేంద్రప్రసాద్, కార్మికశాఖ కమిషనర్, నల్లగొండ జిల్లా

క్లుప్తంగా

కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

అర్వపల్లి: మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఇద్దరిని గాయపరిచింది. ఈ కుక్క దాడిలో గ్రామానికి చెందిన సిరికొండ అంజయ్య, బాసాని మట్టపల్లికి గాయాలయ్యాయి. అలాగే మూడు కుక్కపిల్లలను కరిచి చంపేసింది. కొన్ని మూగజీవాలపై కూడా దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

చండూరు : కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర చేస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం చండూరులో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దేశ సంపదను అదానీ, అంబానీ చేతుల్లో పెట్టి పేదల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. అందులో భాగంగా 29 30 తేదీల్లో చండూరు మండలంలో నిర్వహిస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గ సభ్యులు బొడ్డు వెంకటేశ్వర్లు, తిప్పర్తి రాములు,బరిగల వెంకటేష్, దోటి వెంకన్న, గంట రమేష్, బండమీది వెంకన్న, ఊషయ్య, జెల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని..

- హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై రైతుల ధర్నా
- తాలు ఉందంటూ కొర్రీలు పెడుతున్నారని ఆగ్రహం
- ఆర్డీఓ హామీతో ఆందోళన విరమణ



కొండమల్లేపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు

కొండమల్లేపల్లి : ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొండమల్లేపల్లి మండలంలోని చిన్న అడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి పది రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకొస్తే తాలు ఉందంటూ కొర్రీలు పెడుతూ కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యయ ప్రయాసలకోర్చి కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీల్లో మిల్లుకు తీసుకెళ్లిన ధాన్యాన్ని క్వింటాల్‌కు 6 కేజీల చొప్పున కట్ చేస్తున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న దేవరకొండ ఆర్డీఓ గోపిరాం ధర్నా ప్రదేశానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆర్డీఓ వెంట సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్‌ఐ వీరబాబు ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డితో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తీసుకొచ్చి పదిరోజులైంది



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి పది రోజులు అవుతుంది. పది ఎకరాలను కౌలుకు తీసుకొని వరి సాగు చేశా. తేమ, తాలు పేరుతో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయలేదు. ఒక్కో పట్టాకు రోజుకు రూ.25 చెల్లిస్తున్నా. తాలు పేరుతో క్వింటాల్‌కు 6 కేజీల ధాన్యం అదనంగా తూకం వేయాలని మిల్లు యాజమాన్యాలు అంటున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయడంతో పాటు ధాన్యం కొనుగోలు చేయాలి.

– నేనావత్ పాండు, చింతచెట్టుతండా

ధాన్యం రోడ్డుపై పోసి.. నిప్పంటించి..



చింతపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి : ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం రోడ్డుపై పోసి నిప్పు అంటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. తాలు, తేమ పేరుతో వారం రోజు నుంచి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యం ఆరబోస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఓ పక్క వర్షాలు పడుతున్నందున, ఇప్పటికే రైతులు పంట నష్టపోగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో పరిడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కల్యాణ్‌నాయక్, శివర్ల రమేశ్‌యాదవ్, బొడ్డు మహేశ్, గొడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని..



మిల్లు యజమానితో మాట్లాడుతున్న రైతులు

నకిరేకల్ : కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని ఆగ్రహించిన రైతులు నకిరేకల్ మండలం నోముల గ్రామ శివారులో ఉన్న సాయి వైష్ణవి పార్ బాయిల్డ్ మిల్లు ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారం క్రితమై ప్రారంభించారు. స్థానిక రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. అక్కడి నుంచి స్థానిక మిల్లులోకే వచ్చిన లారీల ధాన్యం దిగుమతి చేసుకోవడంలేదని రైతులు ఆందోళనకు దిగారు. సంబంధిత మిల్లు యాజమాన్యంతో మాట్లాడారు. దిగుమతులు చేసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రైస్ మిల్లుల్లో అల్లరి మూకల విధ్వంసం



మిల్లులో ధ్వంసమైన సామగ్రి

మిర్యాలగూడ : పట్టణంలోని నాలుగు రైస్ మిల్లుల్లో సోమవారం మధ్యాహ్నం కొందరు అల్లరి మూకలు విధ్వంసం సృష్టించి సామగ్రిని ధ్వంసం చేసి అద్దాలు పగులగొట్టారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామ పరిధిలోని సూర్య రైస్ మిల్లులో ఆదివారం సాయంత్రం మిల్లు డ్రైవర్ కోలా శేఖర్ ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. డ్రైవర్ మృతికి సంతాపంగా మిల్లు డ్రైవర్ల సంఘం ప్రతినిధులు సోమవారం మిల్లులు బంద్ పాటించి నిరసన తెలపాలని నిర్ణయించారు. మిల్లు డ్రైవర్లకు వేర్వేరుగా మూడు సంఘాలు ఉండడంతో ఆయా సంఘాల మధ్య ఉన్న విభేదాలతో కొందరు డ్రైవర్లు తమ రోజువారీ విధులకు హాజరయ్యారు. తాము ఇచ్చిన నిరసన పిలుపును నిర్లక్ష్యం చేశారని ఆగ్రహించిన ఇతర సంఘాల ప్రతినిధులు కొందరు అల్లరి మూకలు ఇనుప రాడ్లు, కర్రలతో పలు మిల్లుల్లోకి వెళ్లి విధ్వంసం సృష్టించారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ పరిధిలోని ఆదిత్య రైస్‌మిల్లు, మహేంద్ర, మహాతేజ రైస్ మిల్లులతోపాటు యాద్గార్‌పల్లి వైష్ణవి ఫుడ్ ప్రొడక్ట్స్‌లోకి అల్లరి మూకలు ప్రవేశించి అద్దాలు పగులగొట్టి విద్యుత్ బాక్సును ధ్వంసం చేశారు. మిల్లుల కార్యాలయాల్లోకి వెళ్లి సామగ్రి పగులగొట్టి చిందరవందరగా పడవేశారు. మిల్లుల విధ్వంసం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సోమవారం సాయంత్రం పట్టణంలో సామాజిక మాధ్యమాల్లో ఈ దృశ్యాలు వైరల్ అయ్యాయి. కాగా,యజమానులు తమ మిల్లుల్లో జరిగిన విధ్వంసంపై సీసీ కెమెరాల రికార్డు ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నారు.

ఖననం చేసిన బాలుడి మృతదేహం వెలికితీత

మోత్కూరు : ఖననం చేసిన బాలుడి మృతదేహాన్ని పోలీసులు వెలికితీయించి డీఎన్‌ఏ నమూనాలు సేకరించారు. ఈ ఘటన మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం పాటిమట్లకు చెందిన ఓ వివాహిత అదే గ్రామానికి చెందిన తాళ్లపల్లి సోమయ్య తనపై అత్యాచారం చేశాడని ఫిబ్రవరి 14, 2023న మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు రేప్ కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని కొన్ని నెలల క్రితం రిమాండ్‌కు తరలించారు. అనంతరం సోమయ్య బెయిల్‌పై విడుదలయ్యాడు. సదరు బాధితురాలు బాబుకు జన్మనిచ్చింది. ఆ బాబు గత కొద్ది రోజుల క్రితం మృతి చెందడంతో ఆమె బంధువులు ఖననం చేశారు. కేసు విచారణలో భాగంగా హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీ అబిజిత్ సుభేదార్ ఆధ్వర్యంలో ఖననం చేసిన బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి తహసీల్దార్ షేక్ అహ్మద్ సమక్షంలో పంచనామా నిర్వహించి డీఎన్‌ఏ నమూనాలు సేకరించినట్లు రామన్నపేట సీఐ మోతీరామ్ నాయక్ తెలిపారు. స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఆన్‌లైన్ వెబ్‌సైట్ పోర్టల్ తాత్కాలిక నిలుపుదల

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో టెంపుల్ ఇంటిగ్రేటడ్ స్మార్ట్ టెంపుల్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రతిపాదిత పూర్తి డిజిటలైజేషన్ ప్రాజెక్ట్‌ను వైటీడీఏ ద్వారా ఈసీఐఎల్‌కు కేటాయించినట్లు ఈఓ గీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ వెబ్‌సైట్ పోర్టల్ ఈసీఐఎల్‌చే అప్‌గ్రేడ్ చేస్తున్నారని, దీంతో కొన్ని సాంకేతిక కారణాలతో మంగళవారం నుంచి ప్రస్తుతం ఉన్న దేవస్థానం వెబ్‌సైట్ పోర్టల్ www.yadadritemple.telangana.gov.in తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపు నల్లగొండకు మైనార్టీ కమిషన్ సభ్యురాలు రాక

నల్లగొండ : జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహెజాది ఈనెల 26న నల్లగొండ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. కమిషన్ సభ్యురాలు పర్యటన వివరాలను సోమవారం అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి వివరించారు. బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం, మైనార్టీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జైన్, పార్శి, సిఖ్, బౌద్ధ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ ప్రముఖ ఆధ్యాత్మిక నాయకులతో ఆర్–బి అతిథి గృహంలో సమావేశం నిర్వహిస్తారన్నారు. మైనార్టీలకు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి ఆయా శాఖలు పూర్తి వివరాలతో నోట్స్ గణాంకాలతో సహా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి గోశిక బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు కార్డినల్ పూల ఆంథోని రాక

మఠంపల్లి: క్రైస్తవులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రంలోని శుభవార్త చర్చిలో ఈనెల 25న జరగనున్న మేరీమాత వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా కార్డినల్ పూల ఆంథోని రానున్నట్లు చర్చి కమిటీ పెద్దలు, శుభోదయ యూత్‌సభ్యులు సోమవారం రాత్రి స్థానికంగా తెలిపారు. ఈసందర్భంగా చర్చిలో ఆయన దివ్యబలిపూజ నిర్వహించి క్రైస్తవులకు ఉపదేశం ఇవ్వనున్నారని తెలిపారు.

రియల్‌ఎస్టేట్ సంస్థ కార్యాలయంపై ఐటీ దాడి..?

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధి తంగడపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటవుతున్న భారీ వెంచర్‌కు సంబంధించిన ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయంపై సోమవారం ఐటీ దాడి జరిగినట్టు సమాచారం. వివిధ ప్రాంతాల్లోని సంస్థకు చెందిన అన్ని కార్యాలయాల్లో ఏకకాలంలో దాడులు జరిగినట్టు తెలిసింది. అందులో భాగంగా హైదరాబాద్‌లోని కార్యాలయంలో జరిగిన దాడి మేరకు స్థానికంగా తంగడపల్లి వెంచర్ పరిధిలో కొయ్యలగూడెం గ్రామ శివారులో ఉన్న కార్యాలయాన్ని ముందస్తు జాగ్రత్తలో భాగంగా మూసివేసినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం



నాగమ్మ మృతదేహం

తిరుమలగిరి (తుంగతుర్తి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. తిరుమలగిరి మండలం మామిడాల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మామిడాల గ్రామానికి చెందిన దోతూరి నాగమ్మ (47) జలాల్‌పురం క్రాస్ రోడ్డు వద్ద తొర్రూరు వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని తొర్రూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతురాలి అల్లుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.శివకుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



బాలజోసఫ్ (ఫైల్)

కేతేపల్లి: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కేతేపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లికి చెందిన పసల బాలజోసఫ్(31) మేడ్చల్ జిల్లా కుతుబ్బుల్లాపూర్ మండలం గాజులరామారం లోని ఓ ప్రైవేట్ కంపనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం బాలజోసఫ్ కుటుంబ సభ్యులతో కలసి కేతేపల్లికి వచ్చాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఉన్న నల్లా సంపు నుంచి నీటిని పైకి తోడేందుకు హెచ్‌పీ విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జోసఫ్‌ను సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు జోసఫ్‌కు భార్య, ఏడాది వయసున్న కూతురు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బొమ్మలరామారం : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన దాసరి ప్రసాద్ కుటుంబంతో కలసి మండలంలో కొన్ని రోజుల నుంచి పలు గ్రామాల్లో మామిడి తోటలను కాపునకు తీసుకోవడంతో పాటు రోడ్డు వెంట పుచ్చకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రసాద్ కొడుకు దాసరి కృపారావు (38) ఖాజీపేట్ సమీపంలోని ఓ తోటలో కాపలాదారుగా ఉన్నాడు.ఈ క్రమంలో కృపారావు సోమవారం ఖాజీపేట్, మల్యాల గ్రామం మధ్యన గల షామీర్‌పేట్ వాగులో పడి మృతిచెందాడు. సంఘటన స్థలానికి ఏఎస్‌ఐ అంజయ్య చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు చేపల వేటకు వెళ్లి కరెంట్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడా లేదా ఎవరైనా హత్య చేసి వాగు పడవేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శోకసంద్రంలో మణికాంత్‌రెడ్డి కుటుంబం

- మృతదేహం రావడానికి నాలుగైదు రోజులు వేచి చూడాల్సిందే
- పూర్తికాని పోస్టుమార్టం



రోదిస్తున్న మణికాంత్‌రెడ్డి తల్లిదండ్రులు

భూదాన్‌పోచంపల్లి : వైద్య విద్యనభ్యసించడానికి ఫిలిప్పీన్స్‌కు వెళ్లి అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన గూడురు మణికాంత్‌రెడ్డి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. సోమవారం ఫిలిప్పీన్స్‌లోని మనీలా ఎంబసీ అధికారులు మృతుడి మేనమామ అయ్యపురెడ్డికి ఫోన్ చేసి మణికాంత్‌రెడ్డి మృతిపై కాలేజీ యాజమాన్యం ఏమి చెప్పిందని ఆరాతీశారు. తాము కూడా అక్కడి దావవో మెడికల్ కాలేజీ యాజమాన్యం నుంచి వివరణ తీసుకుంటామని చెప్పారు. మణికాంత్‌రెడ్డి పాస్‌పోర్ట్ క్యాన్సలేషన్, క్యారెంటైన్ రిపోర్టు, ఇతర డాక్యుమెంటేషన్ పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అయితే కాలేజీలో చదువుతున్న ఇండియాకు చెందిన విద్యార్థుల పాసుపోర్టులు కాలేజీ యాజమాన్యం వద్ద ఉండటంతో మణికాంత్‌రెడ్డి మృతిపై పెదవి విప్పితే తరువాత ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోనని భయపడుతున్నారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా, శవ పరీక్ష నిర్వహించడానికి తల్లిదండ్రుల ఆథరైజ్డ్ సంతకం చేసిన అటప్సీ లెటర్‌ను ఆదివారం ఫిలిప్పీన్స్ పోలీసులకు పంపించారు. కానీ ఇంకా మణికాంత్‌రెడ్డి మృతదేహానికి పోస్ట్‌మార్టమ్ నిర్వహించలేదని సమాచారం. పోస్ట్‌మార్టం రిపోర్టు వచ్చిన తరువాత మణికాంత్‌రెడ్డిది హత్యా, లేదా ప్రమాదమా అని విచారించడానికి కనీసం రెండు, మూడు రోజుల సమయం పడుతుందని తెలుస్తోంది. ఇప్పటికే మంత్రి కేటీఆర్‌కు సమాచారం ఇవ్వగా, తాజాగా కేంద్ర పర్యాటకమంత్రి కిషన్‌రెడ్డికి మృతుడి బంధువులు ఫోన్‌చేసి జరిగిన సంఘటనను వివరిస్తూ మణికాంత్‌రెడ్డి మృతదేహాన్ని ఇండియాకు త్వరగా రప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి రాతపూర్వకంగా కంప్లెయింట్ ఇవ్వమని చెప్పగా మృతుడి బంధువులు పంపించారు. మణికాంత్‌రెడ్డి మృతదేహం ఇండియాకు రావడానికి ఇంకా కనీసం నాలుగైదు రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు.



గూడూరు రాంరెడ్డిని ఓదారుస్తున్న నారాయణరెడ్డి

వైద్య విద్యార్థి కుటుంబానికి 'గూడూరు' పరామర్శ

ఫిలిప్పీన్స్‌లో ఉన్నతచదువులకోసం వెళ్లి అక్కడ అనుమానస్పదంగా మృతిచెందిన గూడూరు మణికాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి పరామర్శించారు. రోదిస్తున్న మృతుడి తల్లిదండ్రులు రాంరెడ్డి, రాధాను ఓదార్చారు. మనీలా ఎంబసీ అధికారులు, ఎస్‌జీ కన్సల్టెంట్ వారితో ఫోన్‌లో మాట్లాడారు. కాగా మణికాంత్‌రెడ్డి మృతదేహాన్ని త్వరగా ఇండియాకు రప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామి ఇచ్చారు. పరామర్శించిన వారిలో బీజేపీ అసెంబ్లీకన్వీనర్ చిక్క కృష్ణ, మండల అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, గంజి బస్వలింగం, డబ్బీకార్ సాహేశ్, ఏలే శ్రీనివాస్ ఉన్నారు.

శివాలయంలో విశేష పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. శ్రీస్వామి వారికి నిత్య పూజలు జరిపించి, మండపంలో నిత్య రుద్ర హవనం పూజ నిర్వహించారు. ఇక మహాశివుడికి అభిషేక, అర్చనలు జరిపించారు. శివ గర్భాలయంలో, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి, హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. శివాలయంలో శ్రీశంకరాచార్యుల జయంతి వేడుకలను జరిపించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త శంకరాచార్యుల జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కాగా.. యాదాద్రీశుడికి ఉదయం నుంచి రాత్రి వరకు అర్చకులు విశేష పూజలు చేపట్టారు. సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలను భక్తుల మధ్యన చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయంలో శివలింగం చోరీ

మర్రిగూడ : గుర్తుతెలియని వ్యక్తులు మర్రిగూడ మండల పరిధిలోని యరగండ్లపల్లి గ్రామంలో గల శ్రీ సురమాంబ కంఠమహేశ్వరస్వామి ఆలయంలోని శివలింగాన్ని చోరీ చేశారు. సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం గౌడ కులస్తులు పూజలు నిర్వహించడానికి ఆలయంలోకి వెళ్లగా సురమాంబ కంఠమహేశ్వరస్వామి విగ్రహాల ముందు ఉన్న శివలింగం కనిపించలేదు. రెండు రోజుల క్రితం సూర్య గ్రహణం, అమవాస్య, ఆదివారం కావడంతో భూత వైద్యులకు అనుకూల కాలమానం ఉంటుందొచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. చోరీ జరిగిన ప్రదేశంలో విగ్రహాల ముందు రూ.1,554 ఉంచారు. ఆలయానికి సరఫరా అయ్యే విద్యుత్ వైర్లను కూడా కట్ చేశారు. గౌడ కులస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.రంగారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

బీబీనగర్: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు మెట్టు సమీపంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లాధర్మారం గ్రామానికి చెందిన టైకని యాకయ్య(33) సోమవారం బైక్‌పై కొండమడుగు మెట్టు సమీపంలోని 223మైలు రాయి ఎగువ వైపు రైల్వే ట్రాక్‌పైకి చేరుకున్నాడు. బైక్‌ను ట్రాక్ పక్కన పెట్టి వైన్స్ నుంచి తెచ్చుకున్న రెండు బీర్లను తాగాడు. అనంతరం ఖాజీపేట వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

గుర్తుతెలియని రైలు కిందపడి..

చిట్యాల: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన చిలివేరు మధు(30) హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. కాగా, మధు ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి చిట్యాల వరకు బస్‌లో వచ్చాడు. అనంతరం పట్టణ శివారులోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు సోమవారం గుర్తించి మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు అవివాహితుడు. బలవన్మరణానికి కారణాలు తెలియరాలేదు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలని..

- భువనగిరి కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ బాటిళ్లతో పేదల నిరసన



పెట్రోల్ బాటిళ్లతో నిరసన తెలుపుతున్న పేదలు

భువనగిరిటౌన్ : అర్హులకు డబ్బుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆలేరుకు చెందిన పలువురు పేదలు సోమవారం భువనగిరి కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ బాటిళ్లతో నిరసనతో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల ఆలేరులో అనర్హులకే ఇళ్లు పంపిణీ చేశారని వాపోయారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రాలో ఇళ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులు పద్మవతి, రమాదేవి, కృష్ణవేణి నెత్తిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నించగా పోలీసులు బాటిళ్లను లాక్కున్నారు. కార్యక్రమంలో సల్మాబేగం, కవిత, మంజుల, పద్మ, సర్వర్, భాగ్య, శేఖర్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో పది మూగజీవాలు మృతి

చిలుకూరు: వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో పది పాడి గేదెలు మృతిచెందాయి. చిలుకూరు, అనంతగిరి మండలాల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకూరు మండలంలోని నారాయణపురంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు గ్రామ శివారులో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ప్రమాదవశాత్తు సోమవారం మేతకు అక్కడికి వెళ్లిన గ్రామానికి చెందిన పలువురు రైతుల పది పాడి గేదెలకు విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాయి. ప్రమాదంలో ఏడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో మూడు గేదెలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. నష్టం విలువ సుమారుగా రూ.4లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

తెల్లబండ తండాలో నాలుగు గేదెలు..

అనంతగిరి: విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతిచెందాయి. అనంతగిరి మండల పరిధిలో ఆదివారం భారీ ఈదురుగాలులతో కూడిన కురిసిన వర్షం కారణంగా తెల్లబండ తండా సమీపంలోని ఎన్‌ఎస్‌పీ కాలువ వద్ద వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ తీగలు తెగి కింద పడిపోయాయి. కాగా, గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల నాలుగు గేదెలు మేతకు వెళ్లాయి. కాగా, తెగిపడిన విద్యుత్ తీగలు గేదెల కాళ్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి.